

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని సిఎస్ఐ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల పూర్వ విద్యార్థిని కె.అజిత్ కుమారి(కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్) ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ కె. మురళీకృష్ణ సహకారంతో అంద జేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ ఇర్ఫాన్ అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, బ్యాంకులకు అవినాభావ సంబంధం ఉందని తెలిపారు. బ్యాంకు వాళ్లు ప్రతి ఏటా ఏదో ఒక పాఠశాలకు తమ పరిధిలో పాఠశాలకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులను అందిస్తుంటారని పేర్కొన్నారు. కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ అజిత్ కుమారి మాట్లాడుతూ రీజినల్ మేనేజర్ (చెన్నై) సహకారంతో విద్యార్థులకు ఉపయోగపడుతుందని పాఠశాలకు కంప్యూటర్ ప్రింటర్ అడాప్టర్ అందించామని చెప్పారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మరియాపురం బ్రాంచ్ మేనేజర్ సంపత్ కుమార్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రేమసాగర్, డిసిఇబి ప్రసాద్, మండల వనరుల కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణ ప్రక్రియ వేగవంతం : కలెక్టర్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

ప్రజాశక్తి - కడప

గృహ నిర్మాణ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధికమించి రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మంచి గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి సంబందిత అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) హాలులో జిల్లాలో పేదలకు గృహ నిర్మాణ పథకంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన హౌసింగ్ పనుల పురోగతిపై హౌసింగ్ పీడి కృష్ణయ్యలతో కలిసి జిల్లాలోని హౌసింగ్ డిఇలు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, సంబంధితాధికారలుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలందరికీ సొంతింటి కల సాకారం చేసే హౌసింగ్ పథకంలో భాగంగా జిల్లాలో ఇప్పటికే గృహాలు మంజూరై, ఇంటి నిర్మాణాల ప్రక్రియలో వెనుకబడిన ప్రాంతాల్లో త్వరిత గతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం గృహ నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్లు నాణ్యతతో ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇసుక పాలసీకి లోబడి ఇసుకను సరఫరా చేస్తామని చెప్పారు. ఇసుక అవసరం ఉన్న లేఅవుట్లలో పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇసుకను సరఫరా చేస్తారన్నారు. కొత్తగా హౌసింగ్ పథకంలో లబ్దిదారులకు అక్టోబర్ 2 నుంచి ప్రారంభం అయ్యే నూతన గృహ నిర్మాణ ప్రక్రియలో తప్పకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. నీటిని భవిష్య తరాలకు కూడా అందేలా పొదుపు చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ప్రస్తుతం వివిధ దశల్లో జరుగుతున్న నిర్మాణ పనులను సంబందిత క్షేత్రస్థాయి అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తూ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మెటీరియల్, లేబర్ కాంపోనెంట్, బిల్లుల పెండింగ్, ఇసుక, ఇనుము, నీరు, రోడ్లు తదితర అంశాల్లో సమస్యలపై సంబంధిత మున్సిపాలిటీల కమిషనర్లు, మండలాల ఎంపిడిఒలు, హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తెలియజేయాలన్నారు. గృహ నిర్మణాలు జరుగుతున్న అన్ని లేఅవుట్లపై ప్రత్యేక దృష్టి సారించి గృహ నిర్మాణ లక్ష్యంలో జిల్లాను ప్రథమ స్థానంలో కొనసాగించాలన్నారు. పేదలకు హౌసింగ్ పథకంలో మున్సిపాలిటీలు, మండల స్థాయిలో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని, నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జడ్‌పి సిఇఒ సుధాకర్ రెడ్డి, పిడిఒ ప్రభాకర్ రెడ్డి, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, డ్వామా పీడి జోయల్ విజయ్ కుమార్, కడప నగర కమిషనర్ వై.ఓ. నందన్, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ ఎఇలు, డిఇలు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి- కడప అర్బన్

జిల్లావ్యాప్తంగా రెడ్డి ఏజెన్సీ పరిధిలో పనిచేస్తున్న డ్రైవర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కార్పొరేషన్ అధికారులను మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షులు మనోహర్, సిఐటియు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. 1948 యాక్ట్ ప్రకారం రూ.18 వేలు జీతం ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ. 13వేలు మాత్రమే ఇస్తున్నాయని తెలిపారు. రెడ్డి, పావని ఏజెన్సీల పైన కడప, రాజంపేటలో లేబర్ కోర్టులో విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు. పావని ఏజెన్సీ వారు కొంతమేరకు స్పందించారని తెలిపారు. రెడ్డి ఏజెన్సీ యాజమాన్యం స్పందించకపోగా వేతనాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ఈ తరుణంలో అప్పటి కార్పొరేషన్ కమిషనర్ స్పందించి క్లాప్ బండ్లను తన ఆధీనంలో తీసుకుని నడిపే వారని తెలిపారు. ఆ విధంగా రెడ్డి ఏజెన్సీ డ్రైవర్స్ కొనసాగుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం వచ్చిన కమిషనర్ రెడ్డి ఏజెన్సీ బండ్లను పట్టించుకోకపోవడం వల్ల డ్రైవర్ రోడ్డు మీద పడ్డారని తెలిపారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి రెడ్డి ఏజెన్సీ డ్రైవర్లను వీదుల్లోకి తీసుకోవాలని పేర్కొన్నారు. కనీస వేతనం, సెలవులు పైన లేబర్ కోర్టులో విచారణ సాగుతుందని తెలిపారు. విశాఖపట్నంలో ఇచ్చే విధంగా డ్రైవర్ కు రూ.16వేలు ఇవ్వాలని పేర్కొన్నారు. చేశారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని తెలిపారు.

హాస్టల్ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కస్తూరిబా గాంధీ హాస్టల్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎఐఎస్‌యు నాయకులు కోరారు. శనివారం సమగ్ర శిక్ష పథకఅధికారి అనురాధకు కెజిబివి పాఠశాలల హాస్టల్స్ సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కస్తూర్బా గాంధీ పాఠశాలలు, కళాశాలలు హాస్టల్స్ సమస్యలకు నిలయంగా మారాయని చెప్పారు. హాస్టల్స్‌లో మెనూ అమలు చేయడం లేదని పేర్కొన్నారు. విద్యార్థినులకు సరైన మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఉడికి ఉడకనటువంటి పురుగుల అన్నం, పలచటి మజ్జిగ ఇస్తున్నారని చెప్పారు. జిల్లా అధికారులు స్పందించి విద్యార్థినులసమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

రాయితీ రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -ఖాజీపేట : ఔషధ దుకాణాలు పెట్టుకునే ఫార్మాసిస్టులకు రాయితీ రుణాలు మంజూరు చేయాలని, ఫార్మా డి వారిని క్లినికల్ ఫార్మసిస్టులుగా గుర్తించి పిహెచ్‌సి, సిహెచ్‌సిలలో ఉద్యోగాలు కల్పించాలని ఫార్మాసిస్టుల సంక్షేమ సంఘం సెక్రెటరీ ఓబులేసు అన్నారు. శనివారం ఖాజీపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫార్మసీ చట్టం 1948 సెక్షన్ 42 ప్రకారం ప్రతి ఔషధ దుకాణంలో ఫార్మసిస్ట్ తప్పనిసరి అని అది అమలు కాకపోగా అనర్హత గల వారు ఔషధాలను విచ్చలవిడిగా ఇవ్వడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరగా రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మసీ యాక్ట్ ప్రకారం 1948 సెక్షన్ 19 ప్రకారం ఎన్నికలు జరిపించాలని, ఔషధాల తయారీ రంగంలో 80 శాతం ఫార్మసిస్టులు ఉండే విధంగా పోరాటాలకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఫార్మాసిస్టుల సమస్యలను ప్రభుత్వం త్వరగా పరిష్కరించాలని విన్నవించారు.

లక్ష్యం కోసం చదవండి : సిఐ

ప్రజాశక్తి జమ్మలమడుగు రూరల్ : ప్రతి ఒక్కరూ అనుకున్న లక్ష్యం చేరేందుకు చదవాలని జమ్మలమడుగు సిఐ లింగప్ప తెలిపారు. శనివారం స్థానిక సాయిశివాని కల్యాణ మండపంలో శ్రీ షిర్డీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుధ అధ్యక్షతన ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐ మాట్లాడుతూ డిగ్రీ చదివే విద్యార్థులలో మంచి అవగాహన ఉంటుందని, కావున ఏది మంచి, ఏది చేడు తెలుసుకొని మెలగాలని సూచించారు. తల్లిదండ్రులు మీ లక్ష్యం కోసం కష్టపడుతున్నారని, వారి కష్టాన్ని వమ్ము చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాది భూతమాపురం సుబ్బారావు, షిర్డీసాయి కళాశాల యాజమాన్యం హైమవతి, సంజీవ రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు. చివరగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మత్తు పదార్ధాలతో జీవితం చిత్తు

ప్రజాశక్తి -కడప అర్బన్

మత్తు పదార్థాలు జీవితాలను హరించి వేస్తాయని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పుత్తా పద్మ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్-6 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె. మృత్యుంజయరావు ఆధ్వర్యంలో డ్రగ్ అండ్ యాంటీ-టొబాకోఅవేర్‌నెస్ కార్యక్రమాన్ని శనివారం ఆర్ట్స్ బ్లాక్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ తొలుత సంతోషం కోసం, స్నేహం బలపడేందుకు అంటూ అలవాటయ్యే మద్యం, మత్తు పదార్థాలు క్రమంగా బలహీన స్థితికి తీసుకొస్తాయని తెలిపారు. యువత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్, పొగాకు, ఖైనీ, ఓపియం, గుట్కా, మద్యం ఇవన్నీ మనుషుల ఆరోగ్యాలను, ప్రవర్తనను దిగజారుస్తాయన్నారు. ఈ అలవాట్లు ఉన్న వాళ్ళ స్నేహం చేయొద్దని చెప్పారు. హ్యూమానిటీ డీన్ ఆచార్య కంకణాల గంగయ్య మాట్లాడుతూ మత్తు పదార్థాలు వాడే వ్యక్తుల వివరాలను సంస్థకు తెలియజేయాలన్నారు. సమాజం బాగుపడాలంటే మత్తు పదార్థాలను దూరంగా ఉంచాలన్నారు. మీ జీవితాలకు మీరే ఆర్కిటెక్చర్లని గుర్తు చేశారు. సమాజం మార్పు మీతోనే ప్రారంభం కావాలని ఆంగ్ల శాఖ విభాగాధిపతి ఆచార్య జి. మెర్సీవిజేత విజేత అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా కె. మృత్యుంజయరావు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. అనంతరం విద్యార్థుల చేత మత్తు రహిత సమాజం కోసం పాటుపడతామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో తెలుగు శాఖ ఆచార్యులు రమాదేవి, పార్వతి, పిఎస్ అండ్‌పిఎ సహా ఆచార్యులు డాక్టర్ ప్రమీల మార్గరేట్, అధ్యాపకులు డాక్టర్ టి.సురేశ్ బాబు, డాక్టర్ వినయ్, పి.చిట్టిబాబు, డాక్టర్ వై.హరిబాబు, డాక్టర్ ఖాజాపీర్,ఎస్.ఖాజమైనుద్దీన్, ఇంతియాజ్ అహ్మద్, డాక్టర్ బాలాజి నాయక్, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ నరసింహ, విద్యార్థులు పాల్గొన్నారు.

మేయర్ ఇంట్లో చెత్త వేస్తా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

వాహనాల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ చేయించకపోతే కార్పొరేషన్ మేయర్ సురేష్ బాబు ఇంట్లో చెత్త వేస్తానని కడప ఎమ్మెల్యే మాధవి ఘాటుగా హెచ్చరించారు. గాయత్రి టవర్స్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త సేకరణ వాహనాలను దశలవారీగా తొలగిస్తూ నగరాన్ని చెత్తమయంగా చేసి, ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత రావాలని చూస్తున్నారన్నారు. చెత్త సేకరణ ఎమ్మెల్యే వద్దన్నారని వైసిపి కార్పొరేటర్లు డివిజన్లలో ప్రచారం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. నగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమన్నారు. వైసిపి కార్పొరేటర్ల మాటలు ప్రజలు నమ్మొద్దని కోరారు. ఇంటింటి చెత్త సేకరణకు అయ్యే ఖర్చు కార్పొరేషన్ చెల్లించాలన్న జీవో ఉందన్నారు. కార్పొరేషన్ చెల్లించదని, మేయర్ చెత్త సేకరణను నిలుపుదల చేయిస్తున్నారని చెప్పారు. చెత్త సేకరించకుండా ప్రజలను ఇబ్బంది పెడితే మేయర్, కార్పొరేటర్ ఇంటి వద్ద చెత్త వేయాలని సూచించారు. సొల్యూషన్ మత్తుకు పిల్లలు బానిసలు అవుతున్నారని ఎస్‌పి దృష్టికి తీసుకెళ్లామన్నారు. రోడ్లపై కుర్చీల్లో కూర్చుని మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, పద్ధతులు మార్చుకోవాలని లేకపోతే, వీపులు విమానం మోత మోగుతాయని ఆమె మరో మారు హెచ్చరించారు.

నేడు, రేపు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

ప్రజాశక్తి - కడప : ఈనెల 25, 26న రెండు రోజులు సెలవు దినములు అయినప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఆదివారం, సోమవారం జిల్లా వ్యాప్తంగా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యధాతథంగా పనిచేస్తాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న సిడిపిఒ లక్ష్మీదేవి

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- పోరుమామిళ్ల రూరల్

పట్టణంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శనివారం 1089,181 హెల్ప్ లైన్ నెంబర్లు పైన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోరుమామిళ్ల ప్రాజెక్టు సిడిపిఒ లక్ష్మీదేవి మాట్లాడుతూ 1098,181 ఈ హెల్ప్ లైన్ నెంబర్ల పై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామని చెప్పారు. వ్యాసరచన పోటీలో బాల్య వివాహాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించామని చెప్పారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగితే ఐసిడిసి దృష్టికి తీసుకురావాలన్నారు. విజేతలుగా హారిక, షాహిని, లక్ష్మీదేవి, హర్షిత నిలిచి బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వరప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రిన్సి ల్ రెడ్డమ్మ టీచర్లు, ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అత్యాచారాలను అరికట్టాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : మహిళలపై హింస, అత్యాచారాలు ఆపివేయాలని హౌమెనీ మినిస్ట్రీస్ డైరెక్టర్ ఎం.ఎం.సుభాషిని కోరారు. శనివారం కడప సెవెంత్-డే అడ్వంటిస్ట్ సెంట్రల్ చర్చిలో ఉమెన్ మినిస్ట్రీస్ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై గృహహింస, అత్యాచాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టాలని పేర్కొన్నారు.అందుకు మన కుటుంబ నుంచే మనపిల్లలకు విలువలు నేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ పాస్టర్. ఎం.ఎమ్. శాంసన్, సెక్రటరీ పిఆర్‌జి ఎలీషా, ట్రెజరర్ రాంబాబు, డైరెక్టర్స్ కె. ప్రకాష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులతో ప్రమాణాలు చేయించాలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

లంచాలకు మరిగిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి అవినీతికి పాల్పడకుండా నిబద్ధతతో నిజాయితీగా పనిచేస్తామని అక్కడి అధికారులతో దేవుని పటాలపై ప్రమాణాలు చేయిస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ముందుగా వర్గీయులు, తమ నాయకులతో అవినీతి అక్రమాలకు పాల్పడమని ప్రమాణాలు చేయించాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ బంగారు మునిరెడ్డి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుందూ-పెన్నా జగనన్న కాలనీల నుంచి విచ్చలవిడిగా ఇసుక అక్రమంగా తరలిపోతోందన్నారు. నంద్యాల వరద రాజులరెడ్డి (ఎన్‌విఆర్ఆర్)పేరుతో ఉన్న టిప్పర్లను ఈ అక్రమ దందాకు వినియోగిస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను సమావేశంలో ప్రదర్శించారు. అయినా పోలీసులు అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. స్వయానా ఎమ్మెల్యే సోదరుని కుమారుడు ఈ అక్రమ దందాకు పాల్పడుతున్నారన్నారు. మూడవ వార్డు కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మి శుక్రవారం బహిరంగంగా అక్రమ రేషన్‌బియ్యం వ్యాపారం చేస్తు న్నారని ఆరోపించారు. సమావేశంలో కౌన్సిలర్లు జీలానిబాష, అనిల్‌కుమార్, మాజీ కౌన్సిలర్ పోసా భాస్కర్3వ డివిజన్ ఇన్‌ఛార్జి బాష పాల్గొన్నారు.

బిల్లుల్లేని బంగారం పట్టివేత

- 1.560 కిలోలు ఉండొచ్చని అంచనా
- విలువ సుమారు రూ.1.5 కోట్లు


పట్టుబడిన బంగారం బిస్కెట్లు, స్వాధీనం చేసుకున్నట్లు పత్రం అందజేస్తున్న సిఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బిల్లు లేని బంగారు బిస్కెట్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి బరువు 1.560 కిలోలు, వీటి విలువ సుమారు రూ.1.5 కోట్లు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. ఎస్.పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు డిఎస్‌పి, అదనపు డిఎస్‌పి జి.వెంకట రాముడు ఉత్తర్వుల మేరకు శనివారం ఉదయం 6.00 గంటలకు కడప వన్ టౌన సిఐ సి.భాస్కర్ రెడ్డికి వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ జి.అమర్నాథరెడ్డి, సిబ్బందితో కలిసి రెండో గాంధీ బొమ్మకు వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఒక వ్యక్తి మోటార్ సైకిల్ మీద బ్యాగ్ తగిలించుకుని వస్తూ ఉండగా, అనుమానంతో అతన్ని ఆపి పెద్దమనుషుల సమక్షంలో తనిఖీ చేశారు. అతని పేరు దేశ్ ముఖ్ భరత్ రాజారావ్, బికెఎం స్ట్రీట్, కడప నగరం అని పోలీసులకు చెప్పారు. అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను సోదా చేయగా అందులో 1 కిలో 560 గ్రాముల బరువు గల బంగారు బిస్కెట్లు, బంగారం కడ్డీలు ఉన్నాయి. ఎస్ఐ బంగారు గురించి బిల్లులు చూపించమని అడుగగా, అతను బంగారంకు సంబంధించిన ఎలాంటి బిల్లులు లేవని, జిఎస్‌టి కట్టకుండా బిజినెస్ చేస్తూ ఉన్నానని చెప్పాడు. బంగారం బిల్లులు లేకుండా, జిఎస్‌టి కట్టకుండా బ్లాక్‌లో అమ్ముతూ ఉన్నందున, పై బంగారాన్ని అతని వద్ద పంచనామా ద్వారా స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్య నిమిత్తం ఇన్‌కమ్ టాక్స్ డిపార్టుమెంటు, తిరుపతి వారికి రిపోర్ట్ ద్వారా అప్పగించారు.

కిక్కిరిసిన గండి క్షేత్రం

- 270 మంది పోలీసులతో భారీ బందోబస్తు
- పలు సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలం


దర్శనం కోసం క్యూలో నిల్చున్న యాత్రికులు

ప్రజాశక్తి- చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్రం మూడవ శ్రావణ శనివారం పురస్కరించుకొని యాత్రికులతో కిక్కిరిసిపోయింది. శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకే ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు అభిషేకం చేసి ప్రత్యేకంగా తెప్పించిన పూలతో ప్రధాన అర్చకులు కేసరి , ఉప ప్రధాన అర్చకుడు రాజా అలంకరణ చేశారు. దేవస్థాన సహాయ అసిస్టెంట్ కమిషనర్ ఇన్‌ఛార్జి జె. వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణ తేజ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. తొలుతుగా టిడిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి, చక్రాయపేట మండల ఇన్‌ఛార్జి మహేశ్వర్ రెడ్డి ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గండి క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌పి ఆదేశాల మేరకు డిఎస్‌పి మురళి నాయక్ ఆధ్వర్యంలో సుమారు 300 మంది పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వేంపల్లి వైపు నుండి వచ్చే వాహనాలు వీరన్నగట్టుపల్లె క్రాస్ వద్ద, రాయ చోటి వైపు నుండి వచ్చే వాహనాలు అద్దాల మర్రి క్రాస్ వద్ద నిలిపివేశారు. దీంతో యాత్రికులు కొద్ది దూరం నడిచి ఆంజనేయ స్వామిని దర్శనం చేసుకున్నారు. గండి క్షేత్రానికి కాలినడకతో వచ్చే భక్తులకు ఇబ్బందులు ఎదుర్కొనకుండా తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎన్ ఆర్ స్వాతి సాయి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శ్రావణమాసం ఉత్సవాల్లో జిల్లా నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుండి ప్రజలు రావడంతో గండి క్షేత్రం కిక్కిరిసింది. కార్య క్రమంలో టిడిపి అధికార ప్రతినిధి, పట్టెం అశోక్ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దుల చంద్ర, గండి దేవస్థానం మాజీ చైర్మన్ వెంకటస్వామి, భాస్కర్, డి.ఎస్.పి మురళి నాయక్, సిఐలు, ఎస్ఐ లు, పోలీసులు, సిహెచ్ఒ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

గండి అంజన్న సేవలో ట్రిపుల్ఐటి విద్యార్థులు

వేంపల్లె : గండి క్షేత్రంలో ట్రిపుల్ ఐటి విద్యార్థులు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆర్‌కె వ్యాలీ ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్ ఆదేశాల మేరకు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గండి క్షేత్రంలో యాత్రికులకు సహాయ సహకారాలు అందించారు. శ్రావణ మాసం మూడో శనివారం సందర్భంగా గండి వీరాంజనేయ స్వామి దర్శనానికి ప్రజలు భారీ ఎత్తున తరలి వచ్చారు. దీంతో ఆయా ప్రాంతాల నుంచి గండి క్షేత్రానికి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నదానం, లడ్డు, విక్రయం, తాగునీరు, రక్త దాన కేంద్రాల వద్ద ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఉండి సేవలందించారు.

మోడీ పాలన దౌర్భాగ్యం : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప : నారి శక్తి, నారి అధినియం, నారీ సమ్మాన్ అంటూ సొల్లు కబుర్లు చెబుతూ దేశ ప్రజలను దారుణంగా మోసం చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ దౌర్భాగ్యపు పరిపాలనలో దేశమంతట దుశ్శాసన పర్వంలా మారిందని ఎపి మైనార్టీ ఉపాధ్యక్షులు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ఆందోళన వ్యక్తం చేశారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోజూ దేశంలో మహిళలపై సుమారు 90కి పైగా అత్యాచార నేరాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, నేరాలు, ఘోరాలు అరికట్టడంలో ఘోరంగా విఫలమైన అత్యంత అసమర్థుడైన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మణిపూర్ రాష్ట్రంలో గత ఏడాది కాలం నుండి మహిళలపై అత్యాచారాలు, ముకుమ్మడి దాడులు, దుశ్శాసన ఘోర ఆకృత్యాలు,అఘాయిత్యాలు జరుగుతున్నప్పటికీ నేరస్తులను, నేరాలను పూర్తిస్థాయిలో నిర్మూలించడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ , హోం మంత్రి అమిత్ షా ఘోరంగా విఫలమయ్యారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్న కులయప్ప పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆత్మవిశ్వాసం ముఖ్యం : జెసి

ప్రజాశక్తి - కడప



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న జెసి

విద్యార్థులకు ఏదైనా సాధించగలమే ఆత్మవిశ్వాసం ఉడాలని జెసి అదితిసింద్ పేర్కొన్నారు. శనివారం నేషనల్ స్పేస్ డే సందర్భంగా డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ నిర్వహించిన 'చంద్రయాన్ 3 టచ్చింగ్ లైఫ్ వైల్ టచ్చింగ్ ద మూన్ ఇండియన్ స్పేస్ సాగా' అనే అంశంపై చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఇందులో న్యూ మోడల్ ఇంగ్లీష్ మీడియం చదువుతున్న విద్యార్థులు చిత్రలేఖనంలో ఎం. ప్రతీక్ మొదటి స్థానం, పి.శ్రావణ్ 2వ స్థానంలో నిలిచారు. క్విజ్ లో న్యూ మోడల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ పిల్లలు బహుమతి సాధించారు. ా78వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా స్థానిక శ్రీ వేంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో కడప బాలోత్సవం వారు ఈనెల 4 న చిత్రలేఖనం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విజయం సాధించిన వారికి జెసి ఆదితి సింగ్, డిఇఒ సి అనురాధ చేతుల మీదగా బహుమతు ప్రదానం చేశారు. ఇందులో న్యూ మోడల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కి చెందిన టి. శైలజ వ్యాసరచన పోటీలో ఎం. ప్రతీక్ చిత్రలేఖనంలో విజయం సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలుగా నిలిచిన పిల్లలను న్యూ మోడల్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఎఒ షర్మిల విజయ అభినందించారు.

ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా చర్యలు

ప్రజాశక్తి - కడప : జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి అన్నారు. శనివారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ పవన్‌లో జిల్లా వ్యాప్తంగా ఉన్న న్యాయమూర్తులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ నెల 14న జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారని అన్నారు. ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి ఎల్. వెంకటేశ్వరరావు, రెండవ అదనపు జిల్లా జడ్జి జి. ఎస్. రమేష, నాలుగవ అదనపు జిల్లా జడ్జి దీనబాబు, ఐదవ అదనపు జిల్లా జడ్జి ఎస్. కృష్ణన్ కుట్టి, ఆరవ అదనపు జిల్లా జడ్జి షేక్ ఇంతియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

జిల్లాలో పార్టీకి పూర్వ వైభవం తీసుకొస్తా

ప్రజాశక్తి - కడప : జిల్లాలో వైసిపికి పూర్వ వైభవం తీసుకొస్తానని ఆపార్టీ నూతన అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి శనివారం కడపలోని వైసిపి జిల్లా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. తొలుత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు ఇచ్చిన వై.ఎస్. జగన్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. రాబోయే స్థానిక సంస్థలు, సర్పంచ్ అన్ని ఎన్నికల్లో వైసిపి జెండా ఎగురవేసేలా కృషి చేస్తామని తెలిపారు. రవీంద్రనాథ్ రెడ్డిని ఎమ్మెల్యేలు అమర్నాథ్‌రెడ్డి, దాసరి సుధా, ఎమ్మెల్సీలు డి.సి.గోవిందరెడ్డి, రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అస్పష్టత!

ప్రజా'దృష్టి'

జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక వ్యవహారం సందేహాలకు తావిస్తోంది. జిల్లాలోని 50 మంది జడ్‌పిటిసి సభ్యుల్లో ఒకరు మినహా మిగిలిన సభ్యులు వైసిపి తరుపున గెలుపొందిన సంగతి తెలిసిందే. జడ్‌పి చైర్మన్ చైర్మన్‌గా ఉన్న ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజంపేట అసెంబ్లీ బరిలో నిలిచి గెలవడంతో ఖాళీ ఏర్పడింది. చైర్మన్ ఎన్నిక అనివార్యంగా మారింది. ఇన్‌ఛార్జి చైర్మన్‌గా ప్రొద్దుటూరు జడ్‌పిటిసి జేష్టాది శారద వ్యవహరిస్తున్నారు. చైర్మన్ పదవికి రాజీనామా చేసిన ఆర్నెళ్లలోపు ఎన్నిక నిర్వహించాల్సి ఉంది. ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి పట్టం కట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కమలాపురం నియోజకవర్గానికి చెందిన ఓ టిడిపి సీనియర్ నాయకుడు చైర్మన్ పదవిపై కన్నేయడం ఆసక్తిని కలిగిస్తోంది. వైసిపి తరుపున చైర్మన్ రేసులో నిలిచిన చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి నరేన్ రామాంజులరెడ్డి, బ్రహ్మంగారిమఠం జడ్‌పిటిసి రామగోవిందరెడ్డి టిడిపి వ్యూహాన్ని వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్ దృష్టికి తీసుకెళ్లడం తెలిసిందే. జగన్ జడ్‌పిటిసిలను తాడేపల్లికి పిలిపించుకుని సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. జడ్‌పి చైర్మన్ పదవికి బ్రహ్మంగారిమఠం జడ్‌పిటిసి రామగోవిందరెడ్డిని ఎంపిక చేశారు. వైసిపి జడ్‌పిటిసిల్లో ఐదుగురు గైర్హాజరు కావడం సందేహాలకు తావిస్తోంది. టిడిపి తరుపున జడ్‌పి చైర్మన్ పదవిని ఆశిస్తున్న నాయకత్వం వైసిపి జడ్‌పిటిసిలకు ఫోన్లు చేస్తున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో జడ్‌పి చైర్మన్ ఎన్నిక వ్యవహారం ఉత్కంఠను కలిగిస్తోంది. వైసిపి, టిడిపి వ్యూహాత్మక రాజకీయం ఇలా ఉండగా జడ్‌పి చైర్మన్ పదవి ఎన్నిక నోటిఫికేషన్ వెలవడనుండడం సందేహాలకు తావిస్తోంది. చైర్మన్ పదవి ఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేస్తుందా, ఇన్‌ఛార్జి చైర్మన్‌తోనే జిల్లా పరిషత్ పాలక వర్గం నడిపించే అవకాశాలు ఉన్నాయా అనే సంగతి తేలాల్సి ఉంది. ప్రభుత్వం శుక్రవారం రైల్వేకోడూరు మండలం మైసూరివారిపల్లిలో నిర్వహించిన గ్రామసభకు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ హాజరయ్యారు. మైసూరివారిపల్లి గ్రామసభనుద్దేశించి ప్రసంగించారు. గ్రామసభ ఆమోదించిన తీర్మానాలను మాత్రం ఏకరువు పెట్టారు. ఎటువంటి హామీగానీ, వరాలు గానీ ప్రకటించకపోవడం తీవ్ర నిరుత్సాహాన్ని కలిగించింది. పంచాయతీలను బలోపేతం చేస్తామని చెప్పడం మినహా ఫలానా సమస్యకు కేటాయింపులు చేస్తున్నామని ప్రకటించకపోవడం గమనార్హం. గత ప్రభుత్వ హాయాంలో రూ.41 కోట్ల ఉపాధిహామీ పథకానికి ఖర్చు చేశారని, ఇందులో రూ.21 వేల కోట్ల నిధులు ఏమయ్యాయో తెలియడం లేదని చెప్పడం మినహా ఎటువంటి ప్రయోజనమూ నెరవేరలేదు. తమ హయాంలో ఫలానా పనులకు ఫలానా మొత్తాన్ని ఖర్చు చేస్తామని ప్రకటించిన పాపాన పోలేదు. మొత్తం ఎపిసోడ్‌ను పరిశీలిస్తే ఒట్టి మాటలు కట్టిపెట్టడం మినహా గట్టి మేలు తలపెట్టిన దాఖలాల్లేవని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



కార్నియాలను వైద్య సిబ్బందికి అందిస్తున్న కుటుంబ సభ్యులు

నేత్రదానంతో ఇద్దరికి చూపు

ప్రజాశక్తి పులివెందుల టౌన్

నేత్రదానం చేయడం వల్ల ఇద్దరు అంధులకు చూపు అందుతుందని స్నేహిత అమృత హస్త సేవా సమితి అధ్యక్షుడు ముమ్మేల రాజు అన్నారు. శనివారం పట్టణం లోని చెన్నారెడ్డి కాలనీకి చెందిన చల్లేటి నారాయణమ్మ మరణించడంతో ఆమె కుమారుడు ముని గోపాల్ రెడ్డి, కోడలు భాగీరథమ్మ కుమార్తె మునెమ్మ, అల్లుడు నాగిరెడ్డి నేత్ర దానానికి అంగీకరిస్తూ బుధవారం స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారం ఇచ్చారు. ఆయన టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుని స్వగృహంలో మృతదేహం నుంచి కార్నియా లను సేకరించి హైదరాబాద్ లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు మళ్లీ ఈ లోకాన్ని చూడొచ్చన్నారు. అంధులకు చూపు ఇచ్చి మరణం తరువాత కూడా ఈ ప్రపంచాన్ని చూడాలని తలిస్తే కుటుంబం లోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన అనంతరం 9966509364 లేదా 7093204537 లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులకు బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞతలు తెలిపారు.

వసంత కుమారి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-కాశినాయన

నరసాపురం ఆరోగ్య కేంద్ర పరిధి ప్రాంతాల ప్రజలకు స్టాఫ్ నర్స్‌గా వసంత కుమారి చేసిన సేవలు మరువలేనివని మండల వైద్యాధికారి ప్రశాంతి పేర్కొన్నారు. వసంత కుమారి ఉద్యోగోన్నతిపై బదిలీ అవుతున్న సందర్భంగా నర్సాపురం ఆరోగ్య కేంద్రంలో శనివారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ వసంత కుమారి ఆరోగ్య కేంద్రంలో దాదాపు 15 ఏళ్ల విధులు నిర్వహించారని చెప్పారు. మొదట పోస్టింగ్ ఈ ఆస్పత్రిలోనే తీసుకుని అప్పటి నుంచి ప్రజలకు వైద్య సేవలు చేశారన్నారు. ఆమె బదిలీ ఆరోగ్య కేంద్రంలో తీరని లోటు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది నిర్మల, శ్రీనివాసులరెడ్డి, సుబ్బారాయుడు, బాలయ్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



వసంతకుమారిని సన్మానిస్తున్న వైద్యాధికారి

కృష్ణాష్టమి వేడుకలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె


స్థానిక వడ్డే వీధిలో ఉన్న శ్రీకృష్ణుని ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను విజయవంతంగా చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షులు దేరంగుల రామాంజనేయులు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీకృష్ణుని ఆలయంలో సోమవారం అభిషేకం, తులసి పూజ, మంగళ హారతితో పాటు ప్రత్యేక పూజలు ప్రధాన అర్చకుడు ప్రసాద్ శర్మ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్నదానం కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సంస్కృతిక కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. సాయంత్రం 5 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అందరూ విచ్చేసి కార్యక్రమానికి విజయవంతం చేయాలని కోరారు.

గ్రామసభలు నిర్వహించడం హర్షణీయం

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహించడం హర్షణీయమని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ తులసిరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య సాధనలో గ్రామ సభలు తొలి అడుగు అని కాబట్టి ఇంకా చేయాల్సింది చాలా ఉందన్నారు. స్థానిక ప్రభుత్వాలు కాంగ్రెస్ మానస పుత్రికలు అని, భారత రాజ్యాంగంలోని 11,12 షెడ్యూల్ ద్వారా గ్రామీణ, పట్టణ స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు కల్పించిందన్నారు. 40వ అధికరణ, 243ఙ అధికరణ మేరకు స్థానిక ప్రభుత్వాలు, స్వయం ప్రతిపత్తి గల ప్రభుత్వాలుగా పనిచేయడానికి కావాల్సిన అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక ప్రభుత్వాలకు ఇవ్వాలని చెప్పారు. గతంలో వైసిపి ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా కేంద్ర నిధులను మళ్లించిందని చెప్పారు. సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేసి స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేసిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు గ్రామ సభలు నిర్వహించడం, పంట పనులకు ఆమోదం తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. రూ. 2500 కోట్లు నిధులు విడుదల చేయడం సంతోషం అన్నారు. నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొని రావాలని కోరారు. గ్రామ సచివాలయాలను స్థానిక ప్రభుత్వాల పరిధిలోకి తీసుకొని రావాలని చెప్పారు. జిల్లా పరిషత్, మండల పరిషత్, గ్రామ పంచాయతీలు, మున్సిపాల్టీ, కార్పొరేషన్లను బలోపేతం చేయాలని, అప్పుడే నిజమైన గ్రామ స్వరాజ్యం అన్నారు.



మాట్లాడుతున్న తులసిరెడ్డి

రికార్డులు తప్పనిసరిగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి- సింహాద్రిపురం

ప్రతి వాహనదారుడూ వాహనానికి సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలని ఎస్ఐ తులసి నాగ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని బస్టాండ్ సమీపంలో వాహనాలను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులకు పలు సూచనలు, సలహాలను తెలియజేశారు. ముఖ్యంగా మోటార్ బైక్ పై వెళ్లే వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కారు, ఇతర భారీ వాహనాలకు సంబంధించి సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి అన్నారు.

ఇ-క్రాప్ తప్పక నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి -ఖాజీపేట

ఖరీఫ్‌లో పంటలను సాగు చేసే రైతులందరూ ఇ-క్రాప్‌ను తప్పకుండా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన మండల పరిధిలోని తుడుములదిన్నెలో ఇ క్రాప్ నమోదు గురించి రైతులకు అవగాహన కల్పించారు. క్రాప్ నమోదు చేసుకోవడం ద్వారా క్రాప్ ఇన్సూరెన్స్, పెట్టుబడి రాయితీ వర్తిస్తాయన్నారు. అనంతరం స్థానిక బస్టాండ్ కూడలిలోని ఎరువుల దుకాణాలను, గోడౌన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎంఆర్పి ధరలకే రైతులకు ఎరువులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంట పొలాలను పరిశీలించి రైతులకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎఓ నాగార్జున, సిబ్బంది జమాలమ్మ, సర్పంచ్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

ఎసిఎ అండర్-23 క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఎసి సౌత్ జోన్ అండర్ - 23 మల్టీ డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. వైఎస్ఎ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో కర్నూలు, నెల్లూరు జట్టు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 62.0 ఓవర్లలో 259 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని సాయి సూర్యతేజారెడ్డి 92, నయీముల్లా 54 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని సుతేజ్ రెడ్డి 3, మాధవ్ 2, నారాయణ 2, భార్గవ్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ కు దిగిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 18.0 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 87 పరుగులు చేసింది. కర్నూలు జట్టులోని ఇస్మాయిల్ 4 వికెట్లు తీసుకున్నాడు.

కెఎస్ఆర్ ఎమ్ క్రికెట్ మైదానంలో కడప, చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. చిత్తూరు జట్టుకు చెందిన తేజ రెడ్డి సెంచరీ చేయడంతో ఆ జట్టు భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన చిత్తూరు జట్టు 90.0 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 395 పరుగులు చేసింది. ఆ జట్టులోని వై తేజ రెడ్డి 122 పరుగులు (సెంచరీ) చేశాడు. ధరణి కుమార్ నాయుడు 60, కె. నికిత్ 60 పరుగులు (నాటౌట్) చేశారు. కడప జట్టులోని ఆదిల్ హుస్సేన్ 3 వికెట్లు తీసుకున్నాడు.



తలపడుతున్న నెల్లూరు, కర్నూలు జట్లు

ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ



పాత గోడలకు పూసిన రంగులను చూపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు - నేడు పనులలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, వీరపోగు రవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాడు నేడు పనులు కోసం గత ప్రభుత్వం రూ.కోటి 15 లక్షలు నిధులు మంజూరు చేసిందని, అక్కడ పూర్తిస్థాయిలో పనులు జరగలేదని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ రూ. 53 లక్షలు ఇంతవరకు వచ్చిందని, ఇంకా మిగతా బకాయి రావాలని అన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు అక్కడ వెళ్లి చూడగా పాత భవనాలకు రంగులు పూసి ఎటువంటి మరమ్మతులు చేయకుండా, తరగతి గదులలో సీలింగ్ పెచ్చులు ఊడి పడుతున్నాయన్నారు. ఎంత నాసిరికంగా ఉన్నాయో, గతంలో ఉన్న పాత భవనం మెటీరియల్ నూతన భవనం కోసం వాడి మొత్తం బిల్లులు పెట్టి పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డారని చెప్పారు. కళాశాల ప్రహరీ కూడా నాసిరకంగా కట్టారని వారు వాపోయారు. ప్రభుత్వ సొమ్మును కాజేసిన ప్రిన్సిపల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, సస్పెండ్ చేయాలని, 75 సంవత్సరాల అతి పురాతన భవనం కూల్చి, అందులోని విలువైన దులాలు వంటి వాటిని అమ్ముకున్న ఆరోపణలున్నాయని, వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అభినయ్ పాల్గొన్నారు.

అనుమతి లేని ఎరువులు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

అనుమతి లేని ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని వ్యవసాయ సహాయసంచాలకులు ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో పులివెందుల వ్యవసాయ డివిజన్ పరిధిలో ఉన్న పులివెందుల, వేముల, లింగాల మండలాలకు చెందిన పురుగుమందులు, ఎరువులు, విత్తనాల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రస్తుతం సాగులో ఉన్న పంటలు వాటికీ పురుగులు, తెగుళ్ల, ఉధృతి ఎక్కువున్నప్పుడు ఏమందులు వాడాలి, ఎంత డోస్ వాడాలి అని వివరించారు. దుకాణాలలో లైసెన్స్ కనిపించేవిధంగా పెట్టాలని, అమ్మిన రైతులకు బిల్లులు ఇవ్వాలని రోజువారీ అమ్మకాల స్టాక్ రిజిస్టర్‌లో ఎంటర్ చేసి షాపులో ఉన్న స్టాక్‌తో సరిచూసుకోవాలన్నారు. రైతులకు నాణ్యమైన మందులు అమ్మి రైతుల శ్రేయస్సు కోసం పాటుపడాలి అని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు సునీల్ కుమర్ రెడ్డి, చెన్నారెడ్డి, నాగలక్ష్మి, వ్యవసాయ శాస్త్రవేత్తలు, శివారెడ్డి, బయర్ కంపెనీ ఆర్ మ్,సేల్స్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, పులివెందుల, వేముల, లింగాల మండలాల ఎరువులు షాప్ డీలర్లు హాజరైనారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ ఏడి ప్రభాకర్ రెడ్డి

ఆర్తీ హోమ్‌ను సందర్శించిన కెనడా మహిళలు

ప్రజాశక్తి - కడప అర్బన్

కెనడాకు చెందిన లిల్లీసింగ్ తన తల్లి మాల్విందర్‌కౌర్‌తో కలిసి ఈనెల 22, 23వ తేదీల్లో ఆర్తీహోమ్‌ను సందర్శించారు. వారి పని తీరును తెలుసుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రాచుర్యం పొందిన లిల్లీసింగ్‌కు 15 మిలియన్లకు మించి ఫాలోయింగ్ ఉంది. లిల్లీసింగ్ అభినేత్రి, రచయిత్రి, దర్శకురాలు, నిర్మాత, సంఘసంస్కర్త, తన ద్వారా స్థాపించబడిన సంస్థ యూనికార్న్ ఐలాండ్, ఆర్తీహోంలాగానే సాంఘీక కార్యకలాపాలు, లింగ సమానత్వం పై పని చేయడం విశేషమన్నారు. వ్యవస్థాపకులు, అధ్యక్షులైన పి.వి.సంధ్య ఆర్తీ హోం కార్యకలాపాలు, సమాజంపై దాని ప్రభావం గురించి క్లుప్తంగా వివరించారు. ఆర్తీ స్కూల్‌కు అనంతరం లిల్లీసింగ్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, డైరెక్టర్ భాగ్యమ్మ, హెడ్మాస్టర్ ఓబులేసుతో మాట్లాడారు. ప్రీస్కూలు పిల్లలతో కలిసి పద్యాలు చదవడం వారితో ఆట, పాటలతో గడిపారు. తన బృదంతో కలిసి పెద్ద పిల్లలతో మాట్లాడి వారి లక్ష్యాలను కనుగొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి దుర్గాకుమారి, ఆర్తీహోం సిబ్బంది పాల్గొన్నారు.



పిల్లలతో కెనడాకు చెందిన లిల్లీ సింగ్

పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



సాయిబాబాస్కూల్‌లో చిన్నారులతో చైర్మన్ రామచంద్రారెడ్డి, సిఇఒ శ్రీదేవి



వేంపల్లె: కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారులు, కరస్పాండెంట్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని అక్కాయ్యపల్లెలో ఉన్న సాయిబాబా విద్యాసంస్థల్లో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. కృష్ణుడు జన్మించిన మరుసటి రోజు ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని చేసుకుంటారని పేర్కొన్నారు. విద్యా సంస్థల సిఇఒ ఎం.వి. శ్రీదేవి మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి చేసుకోవాలని విద్యార్థులకు, ప్రవేశం తల్లిదండ్రులకు పిలుపు నిచ్చారు. చిన్నారులు ధరించిన కృష్ణుడు, గోపిక వేషధారణలు ఎంతగానో అలరించాయి. సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బరాయుడు, అధ్యాపక బృందం, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు: వేషధారణలో చిన్నారులు

చైతన్య పాఠశాలలో..

వేంపల్లె : స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కరస్పాం డెంట్ చక్రపాణిరెడ్డి ఆధ్వ ర్యంలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు అందరూ కృష్ణుడు, గోపికల వేషాధారణలతో అలంరించారు. సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యా ర్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం చిన్నారులకు కృష్ణాష్టమి విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చేతన్ రెడ్డి, చైతన్య రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ :

పట్టణంలోని టి.కె.ఆర్ జీవన జ్యోతి హై స్కూల్‌లో కృష్ణుని వేషధారణలో డి.రుత్విక్ యాదవ్ అలరించి ఉట్టిని పగుల గొట్టారు. గౌతమ్ హైస్కూల్ చిన్న పిల్లలు చేసిన వేడుకలు అబ్బురపరిచాయి. అందుకు మధురీలత, లక్ష్మిరెడ్డి ఉపాధ్యాయులు అభినందించారు. బాలాజీ హై స్కూలు, పద్మావతి, సరస్వతి విద్యామందిరం, స్లేట్ పబ్లిక్ స్కూల్, ఇతర ప్రయివేటు పాఠశాలలో నిర్వహించారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ బికెట్ రవి

ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో ప్రభుత్వానికి చెందిన భవనాల్లో పోస్టాఫీసు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జ్ బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి, ఎద్దుల శేషారెడ్డిల కోరారు. శనివారం కడప కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శివశంకర్‌ను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ భవనాలు ఉన్నప్పటికీ ప్రయివేటు భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతున్నట్లు చెప్పారు. ప్రయివేటు భవనాల్లో కార్యాలయాలు ఉండడంతో ప్రతి సారి వేరే ప్రాంతాలకు మార్చాలంటే ఇబ్బందిగా ఉంటుందని, కాబట్టి మార్కెట్ వీధిలో ఖాళీగా ఉన్న పాత వెలుగు కార్యాలయంలోకి పోస్టాఫీసును, రిజిస్ట్రార్ కార్యాలయం మార్చితే బాగుంటుందని విన్నవించారు. ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉండడంతో ఇతర కార్యక్రమాలు జరిగేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయాని చెప్పారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం కూడ తగ్గుతుందని తెలిపారు. స్పందించిన కలెక్టర్ రెండు ప్రభుత్వ కార్యాలయాలను ప్రభుత్వ భవనాల్లోకి మార్చేందుకు చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సిడిపిఒ శ్రీలత

ప్రతి విద్యార్థి పోటీతత్వం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రతి విద్యార్థి పోటీ తత్వం అలవర్చుకున్నప్పుడే తాము ఎంచుకునే లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చని ఐసిడిఎస్ సిడిపిఒ శ్రీలత పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని నిడివిలగల సమీపంలో ఉన్న కస్తూర్బా పాఠశాలలో1098,181 చైల్డ్ హెల్ప్ లైన్ అంశాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివిన ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సహిస్తుందని వాటికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ గురుదేవి, ఐసిటి సూపర్‌వైజర్ వసంత పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు పలకలు పంపిణీ

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా 112వ జయంతి సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణంలోని వికాస్ విహార్ మానసిక దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు బస్సు పాస్‌లు, పలకలు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్‌టిసి డిపో మేనేజర్ మాట్లాడుతూ ఎంతోమందికి పేదల ఆకలి తీర్చి విద్యాబుద్ధులు నేర్చిన అమ్మ మదర్ థెరిసా అన్నారు. ఎంతోమందికి సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి వారికి మానవత్వాన్ని మించినది లేదని తెలిపారు. మనిషికి మరణం ఉంటుందని, కానీ మంచితనానికి మరణం ఉండదని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ మదర్‌థెరిసా 45 సంవత్సరాల పాటు మిషనరీస్ అఫ్ ఛారిటీని భారత దేశంలో, ప్రపంచంలోని ఇతర దేశాలలో వ్యాపించేలా మార్గదర్శకత్వం వహించారని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఝాన్సీ రాణి, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ప్రజాశక్తి -ఖాజీపేట : ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మీ కోసం సేవా సంస్థ సభ్యులు వీర నరేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని అప్పన పల్లెలో ఉచిత మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ట్రీస్ అవుట్ సైడ్ ఫారెస్ట్ కార్యక్రమంలో భాగంగా ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వీర నరేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలను పెంచి సంరక్షించినప్పుడే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు.

అర్బన్ సిఐగా హాసం

ప్రజాశక్తి - మైదుకూరు :

మైదుకూరు అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా హాసం శనివారం బాధ్యతల స్వీకరించారు. ఇటీవల నిర్వహించిన సీఐల బదిలీలలో భాగంగా ఆయన బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా డిఎస్‌పి రాజేంద్రప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం సిఐ మాట్లాడుతూ పట్టణ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక చర్యలు చేపడతానని తెలిపారు. ప్రజలు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు.

